కథానిక

# గర్భశోకం

వేమూరి సుబ్బరామశర్మ

మధు ఆ యింటినుంచి మారాలని రెండేళ్లుగా విశ్వప్రయత్నం చేస్తూంటే ఆనాటికి ఇంకో యిల్లు దొరికింది. రెండుగదులు, వంటయిల్లు, స్నానాది కృత్యాలకు వేర్వేరు గదులు ఉన్నవి. కొత్తఇంట్లోకిమారుతున్నాము గదా అనే సంతోషం అతని భార్య పార్వతిని ఉత్సాహంగా సామాన్లు సర్దేటట్లు చేసింది. వాళ్ళ మూడేళ్ళ చిన్నవాడు తప్పటడుగులు వేసుకుంటూ సర్దిన సామాన్లను లాగివేస్తూ తల్లికి తీయటి అంతరాయాలను కల్గిస్తున్నాడు.

పెట్టెలలోని వస్తువులను క్రమపద్ధతిలో పెడ్తూన్న పార్వతి గదిలో మూలగా అట్టడుగున ఉన్న పెట్టెను బైటకులాగి పైనున్న దుమ్ము దులిపింది. తాళంతీసి ఏవేవో పాత పుస్తకాలు వార్తాపత్రికలు ఉంటే వానిలో అనవసరమైన వాటిని బైట పడవేస్తోంది. పెట్టెలో ఒక మూలనున్న బట్టతీయగా ఒక చిన్నడబ్బా చేతికి వచ్చింది. ఆ డబ్బా మూతతీసి ఒక ఊలుటోపీ, అందాలు తరగని రెండు చిన్నగాజు బొమ్మలు, ఒక పాలపీకె చూసిన పార్వతి అలాగే నిలబడిపోయింది. ఆమె ఆలోచనల సుడిగుండం క్షణంలో ఒక కేంద్రాన్ని ఏర్పరచుకొన్నది.

* * *

అది రెండేళ్ళక్రిందటి చరిత్ర. ఇప్పుడు పార్వతి ముందు తిరిగే చిన్నవాడి తర్వాత సంవత్సరానికే ఆమెకు ఇంకో పిల్లవాడు కల్గాడు. ఇది తమయింట్లో సంతోషం కల్గించినా, ఇరుగుపొరుగులవాళ్ళకు, కొందరు బంధువులకు మగపిల్లలే కల్గుతున్నారని అసూయగా ఉండేది. రవి అని పేరు పెట్టుకున్న ఆ పిల్లవాడు నెలనెలకి కొంగ్రొత్త రూపురేఖలను తెచ్చుకొంటున్నాడు. పది నెలలు నిండిన రవి ఎంతో నేత్రోత్సవం కూర్చేవాడు. మేలిమి బంగారంవంటి శరీరఛాయ, తీర్చిదిద్దిన కనుబొమలు, విశాలమైన కన్నులు, సంపెంగవంటి నాసిక, గులాబిరేకుల పెదిమలుకల చిన్ననోరు, విశాలమైన ఫాలం, గులాబిరంగు చెక్కిళ్లు-రవిని చూస్తే మన్మధుడే అవతరించాడా అనిపించేది. వాడిశరీరం అతి సుకుమారంగా సుతిమెత్తనగా ఉండి ఎక్కడ కొంచెం అధికంగా తాకినా ఎఱ్ఱగా కందిపోయేది.

రవి అందానికి చేష్టలు కూడా దోహదమిచ్చినై. తొట్టెలో కట్టిన చిలకలతోను, బొమ్మలతోను సాధారణంగా ఏదో సంభాషణ జరుపుతూండేవాడు. అరిచేతులూ ముంగాళ్లూ ఆధారంగా పాకటం ప్రారంభించాడు కూడా. తల్లి భావాలను ఒక్క క్షణంలో అర్థం చేసికొని అందుకు తగినట్లుగా బిక్కముఖం పెట్టడమో చిరునవ్వులు కురిపించటమో చేసేవాడు. కోపమొచ్చి మూతి ముడుచుకునే రవిని పార్వతి ఎన్నోసార్లు భర్తకి చూపించి ఆనందించింది. వాడి చేష్టలు చూసి, వాడి అందానికి మురిసి భవిష్యత్తులో ఎన్నో ఆశాసౌధాలను ఆమె నిర్మించుకున్నది.

కాని ఆరోజున మామూలుగా రవి ఉదయించలేదు. అధికంగా నీలిమను పంచుకుని మబ్బులు రవి కిరణాలను సూటిగా భూమికి తాకనియ్యటం లేదు. వేసవికాలం కనుక రాత్రి తామంతా ఆరుబయటనే పడుకున్నారు. దొడ్లో చెట్లమీద పిచ్చుకలు, రంగుపిట్టలు ఆ రోజున కొంచెం ఆలస్యంగా రవి పాపకు మేలుకొల్పులు పాడినై. వాడి ప్రాథమిక భాషలో కొంతకాలం వాటితో మాటలు చెప్పాడు. ఇంతలో రవి ఒక్కసారిగా ఆకాశాన్ని పెకల్చుకొని విజృంభించాడు. రవిని ఇంట్లో పడుకోపెట్టారు.

ఆఫీసుకు వెళ్ళేందుకు మధుకు ఒక గంట వ్యవధి ఉన్నదనగా ప్రక్కభాగంలో ఉన్న

వెంకటేశ్వర్లుగారు సంసారంతోబాటు ఏదో ఊరు వెళుతున్నామని బట్టలు పెట్టుకునేందుకు హోల్డాల్ యిమ్మని అడిగారు. అటకపైన అడ్డంగాఉన్న కాఫీరంగు హోల్డాల్‌ను పార్వతి క్రింద పడేసింది. దానితోపాటు గుప్పెడు ఎండు గడ్డి చిన్నచిన్న పుల్లలతో క్రింద పడ్డది. దానిలో ఉన్న రెండు పిచ్చుక గుడ్లలో ఒకటి ఈ తాకిడికి చితికిపోయింది. ఆమె గుండె గతుక్కుమంది. చెడిపోని గుడ్డును ఆ చెత్తలోనే పెట్టి యథాస్థానానికి చేర్చినప్పుడు అక్కడ బిక్కుబిక్కుమంటూ పొంచి చూస్తున్న పిచ్చుక తల్లిని చూసింది. ఆమె మనస్సు కలచినట్లయి తొట్టెలోని రవిని తీసికొని హృదయానికి హత్తుకొన్నది. ఆమె బుగ్గలను రవి తన చిన్న వేళ్ళతో నిమురుతూ నవ్వులు ఒలకబోసికొన్నాడు. దానిమ్మపండు హృదయాన్ని విప్పి గింజలురాల్చుతున్నట్లుంది ఆనవ్వు.

సాయంత్రం వరకు రవి ఎప్పుడూలేని ఉత్సాహంతో ఆడుకున్నా మనస్సులో ఏదో పీకుతూనే ఉన్నది పార్వతికి. సూర్యాస్తమయం అవుతూన్న సమయంలో రవి శరీరమంతా బాగా వేడెక్కిపోయింది. ఆ రాత్రి అంతా ఇంట్లోనే పడుకున్నారు. జ్వరానికివేసే ఔషధం ఏదో యింట్లోఉంటే రవి నోట్లోపోశారు. పార్వతి తన యిష్టదైవానికి తన పాప జ్వరం తగ్గి క్షేమంగా ఉండేందుకు మొక్కుకుంది. ఎంత జ్వరమున్నా రవి రాత్రి పదిగంటలవరకు ఆడుకుంటూనే ఉన్నాడు. అంతవరకు రవితో ఆడుకున్న పెద్దవాడు తండ్రి పక్కలో నిద్రపోయినాడు. రవికి కొంచెం కునుకు పట్టగానే మంచంమీదనుండి పడిపోకుండా రెండుపక్కల తలగడాలనుంచి వాడి కాళ్ళక్రిందనే పార్వతి కూడా పడుకుంది.

ఆ రాత్రి రెండుమార్లుమాత్రం లేచిన రవికి పాలుపట్టింది ఆమె. తెల్లవారుతూండగా లేచి రవి శరీరం తాకితే ఉష్ణ తీవ్రత అత్యధికంగా ఉంది. చేతికి చీమలుకుట్టినట్టుగా ఉంటే రవిని పక్కనూ పరిశీలనగా తడిమిచూచిన పార్వతికి ఎవ్వరూ నమ్మజాలని అసాధారణమైన, విషాద భరితమైన దృశ్యం కళ్ళముందర కనబడింది. ఒక పెద్ద చీమల సముద్రంలో రవి మునిగి ఉన్నాడు. హృదయం స్పందిస్తూన్న తన పాపనే ఆ క్రిములు పీక్కు తింటున్నాయి. ముఖం, చేతులు, కాళ్లు చీమల కొరుకుడుచేత నెత్తురుచింది ఎఱ్ఱబడి ఉన్నాయి. తక్షణం తన రవిని ఒణుకుతూన్న చేతులలోనికి తీసికొని శరీరమంతా తుడిచింది. వాడికి అణుమాత్రమైనా స్పృహ ఉన్నట్లులేదు. మెడను వేల వేస్తున్నాడు. కంటి రెప్పలు చాలాభాగం గుడ్డును కప్పివేసినాయి. కనుచూపు ఆగిపోయింది. ఈ బాధలు భరించలేనట్లుగా కళ్ళనుండి నీరు కారుతోంది. పాలుకూడా గుటక వేయటంలేదు. పార్వతి ఒక్కసారి పెద్దగా అరిచింది. మధు పరిగెత్తుకువచ్చి పాపాయి పరిస్థితిలోని తీవ్రత గ్రహించాడు.

ఎక్కడున్న వస్తువులను అక్కడనే విడిచిపెట్టి ఇంటికి తాళంవేసి పెద్దవాడిని మధు స్నేహితుడైన శర్మగారింట్లో విడిచి బస్సులు ఆగే స్థలానికి తీసికొని వెళ్లారు. ప్రతినిమషం గడచిన కొద్దీ మధుకంటే పార్వతి ఆందోళన అధికమౌతోంది. అరవై నిమషాలు అరవై యుగాలుగా గడచిన తర్వాత బస్సు వచ్చింది. నాల్గుమైళ్ళు వెళ్ళిన తర్వాత బస్సుదిగి డాక్టరు వద్దకు వెళ్ళారు. పార్వతి రవిని ఆయనచేతుల్లో పెట్టి నోట మాటరాక కంట నీరుపెడుతూ 'బ్రతికించండి' అని మాత్రం అనగల్గింది. వారిద్దరి ముఖాలలోను విషాద రేఖలతోబాటు గంభీరంగా జీవితంలోని చీకట్లను ఎదుర్కొనగలరనే ధైర్యపు రేఖలను గూడా చూడగల్గాడు డాక్టరు. పది నిమిషాలలో జరిగినదంతా విని మృత్యుముఖంలో ఉండేవారికి ఉపయోగించే ఔషధం రవి నోట్లో పోశాడు. అతికష్టంమీద గుటకవేసిన పాప అరగంటకు కదిలాడు. ఇప్పటికి రవి విషమ పరిస్థితిని దాటాడని డాక్టరు ధైర్యంచెప్పి, తనవద్ద ఆ జబ్బుకు తర్వాత వేయవలసిన మందు లేకపోవటం వలన ప్రభుత్వ వైద్యశాలకి తీసికొని వెళ్లమని సలహా యిచ్చాడు. మధును పక్కగా పిల్చి పిల్లవాడు ప్రమాదపరిస్థితిలో ఉన్నాడనీ, అది డబుల్ న్యుమోనియా అనీ చెప్పాడు డాక్టరు. పార్వతి అడిగితే ఏ విషయమూ అడగవద్దని వైద్యశాలకి తక్షణం తీసికొని వెళ్ల

మని కొద్ది తీవ్రతతో అన్నాడు డాక్టరు. ఒక అరగంటలో ఆ దంపతులు రవిని వైద్యశాలలో పిల్లల వార్డులో ప్రవేశపెట్టారు. ఆ సమయానికే సర్జన్ పర్యవేక్షణకు రావటం వారికి శుభసూచనగా కనపడ్డది. మంచంమీద పడుకోబెట్టిన రవిని ఆయన చూచాడు. అన్ని వివరాలు పూసగుచ్చినట్లు మధు చెప్పగా విని ఆయన ప్రథమంలో ఔషధమిచ్చిన డాక్టరు అభిప్రాయాలు అర్థరహితాలని త్రోసిపుచ్చి చీమలు కుట్టిన ఘట్టానికి ప్రాధాన్యాన్నిస్తున్నానన్నాడు. ఈ ప్రపంచంలో ఏ రెండూ అంగీకరించనివానిలో గడియారాలు, వైద్యులు, వకీళ్లు ముఖ్యమైనవిగా గణించాలని మధు ఒక సందర్భంలో చెప్పిన సంగతి పార్వతికి అప్పుడు జ్ఞాపకానికొచ్చింది.

ప్రమాదస్థితిలో వున్నాడని మాత్రం చెప్పి నర్సుకు ఔషధం ఉపయోగించే పద్ధతిని చెప్పి ఆయన వెళ్ళిపోయినాడు. ఐస్ సంచి శిరస్సుకు అద్చిఉంచటం, సూదితో మందు శరీరంలోనికి ఎక్కించటం వంటి జాగ్రత్తలు నర్సే తీసికొంటూన్నది.

రవి బాగా కదలటం, కొద్ది ప్రయాసతోనే పాలు త్రాగటం చేస్తున్నాడు. కాని దృష్టి, స్పృహ లేవనే చెప్పవచ్చు. పార్వతి వాడిదగ్గరే కూర్చుని కంటికి రెప్పగా చూస్తున్నది. ఆరోజున రాత్రివరకూ ఆ తల్లికీ తండ్రికీ మెతుకు గతకాలనే యిచ్ఛే లేదు. చీకటి పడుతూండగా శర్మగారు తామున్న పరిస్థితిని తెలిసికొని కొంత డబ్బు, వారింట్లో వండిన భోజనం క్యారియర్‌లో తెచ్చి మధుకిచ్చి వెళ్ళారు. తనకు వారం రోజులు సెలవు మంజూరయిందని ఆఫీసులో అందుకు తగిన ఏర్పాటు చేశానని చెప్పిన శర్మగారికి మధు నమస్కారం చేశాడు. ఐహికమైన సహాయంలో లోటేమీ లేదని దైవబలం ఉంటే రవి తనకు దక్కుతాడని పార్వతి తలచింది.

మధు బలవంతంమీద నాల్గు మెతుకులు తిని పార్వతి భర్తను ఇంటికి పంపింది. శర్మగారింటి వద్దనున్న పెద్ద పిల్లవాడు ధైర్యంగా ఉండటం చూసిన మధు ఆరాత్రి ఒంటరిగానున్న భార్యకు సహాయంగా ఉందామని వచ్చేవేళకు వైద్యశాల మూసివేయబడి రాత్రి కాపలావాడు కూర్చుని ఉన్న ఒక చిన్న ద్వారం మాత్రం తెరిచి ఉన్నది. అంతా స్త్రీలే ఉండేవార్డులో తను నిద్రించేందుకు వీలులేదని ఎన్నో అభ్యంతరాలు పెట్టాడు కాపలావాడు. అతి కష్టంమీద అతనిని ఒప్పించి పార్వతికి తన ఉనికిని తెలియబర్చి వైద్యశాల క్రింది భాగంలో ఆరుబయట నేలమీద పడుకొన్నాడు మధు. తామింత అవస్థపడుతున్నా తమరవి బ్రతికి గట్టెక్కితే చాలుననిపించేది పార్వతికి.

తెల్లవారేటప్పటికి జ్వరం తగ్గింది. కాని ప్రథమంలో ఉన్న రవిస్థితిలో మార్పేమీ రాలేదు. కాని ఒక క్రొత్తమార్పు కనబడింది. పది గంటలకు వచ్చి చూసిన డాక్టరు రవి శరీరంమీదనున్న పొక్కులు ఆధారంగా పిల్లవానికి ఆటలమ్మ జబ్బు వచ్చినదని, ఒక్క క్షణమైనా అక్కడ వాడిని ఉంచేందుకు వీలు లేదనీ, మూడుమైళ్ల దూరంలోనున్న ప్రత్యేక వైద్యశాలకు కారుమీద తీసికొని వెడతామని చెప్పారు. ఆదంపతుల ఆందోళనకు ఇది ఇంకొక కారణమైనది. ఆ జబ్బులను కల్గజేస్తుందనే అమ్మవారికి అనేక రీతులుగా మొక్కుకున్నది పార్వతి.

ఒక్క గంటలో అంబ్యులెన్సుకారు రావటం, ఆ ముగ్గురినీ ప్రత్యేక వైద్యశాలకు తీసికొని వెళ్లటం జరిగింది. మధు ఇక్కడకు రాకముందు ఈ ప్రదేశంలో అధికంగా రోగులుండి తన చిన్న వాడికి సరియైన చికిత్స శ్రద్ధతో జరగదనుకున్నాడు. కాని ప్రత్యక్షంగా పరిస్థితులను అవగాహన చేసుకున్న తర్వాత తన అభిప్రాయం మార్చుకున్నాడు. పురపాలక సంఘంవారి అశ్రద్ధ జగద్విదితమే కనుక ఆ నగరంలో అంటువ్యాధుల అధికారిణైన అమ్మవారు జూలు విదల్చుకొని విలయతాండవం చేస్తూన్నా, నగరాధికారుల ఆధ్వర్యం క్రిందనుండే ఆ ప్రభుత్వ ప్రత్యేక వైద్యశాలలు ఖాళీగా, నిశ్శబ్దంగా ఉన్నై. వైద్యశాల ఆవరణ పెద్దదిగా ఉండటం, అక్కడున్న పూర్వకాలపు మనిషిలాగున్న నర్సు కారణం కాబోలను—పరిశుభ్రమైన నేల, మంచాలు, పరుపులు ఉండటం, ఆవరణలో గాలితో అను

క్షణమూ మంతనాలాడే ఉవ్వెత్తుగా పచ్చగా పెరిగిన వేప, గానుగ చెట్లు ఉండటం, వాళ్లకు కొంత ధైర్యాన్నిచ్చినై.

ఆరోజున రవి ఆవేదన పడుతున్నాడు. పార్వతి వాడిప్రక్కనే దీనంగా కూర్చుని ఉన్నది. అంటు వ్యాధి కనుక ఆగదిలోనికి పార్వతి తప్ప ఎవ్వరూ రావటానికి వీలులేదు. అక్కడి డాక్టరు వచ్చి రవిని చూసి అది స్ఫోటములోనికి మారుతుందనీ, ఈ వ్యాధులు వాని అంతట అవే తగ్గిపోవాలనీ, అందుకు తగిన ఔషధాలు లేవనీ చెప్పాడు. టీకాలు వేయిస్తే పరిస్థితి ఇంతదాకా వచ్చి ఉండేది కాదని కూడా అన్నాడు.

భవిష్యత్తు చెడుగా ఉంటుందని ఎంత నైరాశ్యంలో మునిగిన మానవుడైనా అనుకోడు. కొద్ది జీవితానుభవాలను చవిచూచిన ఆదంపతుల మనస్తత్వం ఇందుకు భిన్నంకాదు. క్షణాలలో ముంచుకొచ్చిన ఈ ఉపద్రవానికి అర్థం చెప్పలేని అవస్థలో ఉన్నారు వాళ్లు.

డాక్టరు వెళ్లిన తరువాత నర్సును బ్రతిమాలి వేపాకులు తెచ్చి రవి తల కింద శరీరంపైనా పరచింది పార్వతి. మధ్యాహ్నం మధు శర్మగారింటికి భోజనానికి వెళ్లినప్పుడు పెద్ద పిల్లవాడు తండ్రిని చూసి బావురుమని మీద పడ్డాడు. మధు మనస్సు చివుక్కుమన్నది. తను క్రిందటి దినం ఇచ్చిన తంతి సవ్యంగా తన తండ్రికి అందితే తన అక్కగారు తక్షణం బయల్దేరి వస్తుందనీ, అప్పుడు పెద్దవాడిని దిగులు పడకుండా చూడటానికి కొంత అవకాశం కల్గుతుందనీ, తనకు కొంత విశ్రాంతి కల్గి పార్వతి వద్దనే ఎక్కువకాలం ధైర్యం చెప్పతూ గడపవచ్చనీ అనుకున్నాడు. అప్పటికి మాత్రం పిల్లవాడిని సముదాయించి వాడు చూడకుండా క్యారియర్‌లో భోజనం తెచ్చి పార్వతికిచ్చాడు. సాయంత్రం దాకా వైద్యశాలలో ఉండి ఆరాత్రికి పార్వతికి హోటల్ నుండి భోజనం తెచ్చి యిచ్చాడు. 'అమ్మవారు' జబ్బు అని తెలిసిన తర్వాత పిల్లలుగల శర్మగారి యింటినుండి భోజనం తేవటం యిష్టంలేకనే యీపని చేశాడు మధు. అతని అభిప్రాయాన్ని సరిగా అర్థంచేసుకున్న శర్మగారు ఏ అభ్యంతరం పెట్టలేదు. హోటల్ భోజనంచేసిన మధు పార్వతి ప్రాధేయపడగా పెద్ద పిల్లవాడు దిగులు పడకుండా ఉండేందుకు ఇంటికి వెళ్లి రాత్రి తన దగ్గరే వాడిని పడుకోబెట్టుకున్నాడు. ఆ చిన్నవాడు మధును గట్టిగా కౌగలించుకొని నిశ్చింతగా నిద్రపోయినాడు.

* * *

రెండు రాత్రులూ ఒక్కక్షణమైనా కన్ను మూయని పార్వతి తెల్లవారేటప్పటికి చాలా నీరసంగా ఉన్నది. కాని తన అందాల పాపను కాపాడుకోవటంలో ఇవేమీ గణనకు రానట్లనిపించింది ఆమెకు. రవి శరీరంమీద దట్టంగా, పెద్దగా లేచిన పొక్కులను చూసిన 'నర్సు' స్ఫోటకం వచ్చిందని చెప్పింది.

ఆరోజున మధు అక్కగారు రావటం మానసికంగా మధుకు కొంత విశ్రాంతి నిచ్చినట్లున్నది. పెద్దదైన ఆమె పార్వతి దగ్గరనే ఉండి ధైర్యం చెపుతున్నది. డాక్టరు వచ్చి వారి ముగ్గురికీ టీకాలు వేశాడు. మానవుడే ఐన డాక్టరు అంటువ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ఆయన నేర్చుకున్న ఈ మాత్రపు చికిత్స చేశాడని మాత్రమనిపించింది పార్వతికి. మధుకు టీకాలు అత్యవసరమనిపించినై.

కన్ను తెరువని, స్పృహసరిగారాని రవి బాధతో ఆవేదనతో ఆరోజంతా గడిపాడు. పార్వతి రాత్రి కొద్దిగా ఒక అరగంట రెప్పలు బరువెక్కి కునుకుపట్టినట్లుగా అయితే ఒక పెద్ద గులాబి పువ్వును అతిభయంకరమైన రాక్షసులు త్రుంచి నేలమీద రెక్కలను విరజిమ్ముతున్నట్లుగా కలవచ్చి ఉలిక్కిపడిలేచింది. మధు అక్కగారు ఆమెను శాంతపరచింది.

శాంతంగా ఉపేక్షగా మూగగా చీకట్లు విడిపోతున్నై. ప్రాక్సతీ గర్భంనుండి పెకల్చుకు రావటానికి రవి మరణ యాతన పడుతున్నాడు. ఉదయించాడా లేదా అన్నట్లు రవి తేజస్సు భూమిని తాకకుండా కారు నలుపుమచ్చులు ఆకాశాన్ని కప్పి పుచ్చినై.

పాపాయి రవి శరీరంరంగు మారటం ప్రారంభమైనది. మూడు రోజులనుండి అంతఃక్షోభను భరించిగూడా రవి తన బంగారపు ఛాయను అంతగా కోల్పోలేదు. వాడి విశాలమైన

ఫాలభాగం, నేత్రాలు భవిష్యత్తులో గొప్ప మేధావై అత్యున్నతస్థానాన్ని అలంకరిస్తాడనే ఆశలు పార్వతి మనస్సునుండి అంతవరకు అంతరించలేదు. కాని ఆరోజున వాడిపరిస్థితి భిన్నంగా ఉంది. పొక్కులు బాగా కుంచుకుపోయి దించుకుపోయి మాడినట్లయినై. ఇది మంచిని సూచించదు పరిశీలనకు వచ్చిన డాక్టరుకూడా ఏమీ మాట్లాడక నర్సుతో ఏదోచెప్పి వెళ్లాడు. నర్సునెంత అడిగినా ఎవరికీ ఏసంగతీ చెప్పలేదు.

మధ్యాహ్న మౌతూండగా రవి శరీరపు రంగు నల్లబడింది. ఎగశ్వాస ఆరంభమైంది పదిక్షణాలలో రవి కను రెప్పలు పూర్తిగా మూసుకుని శాశ్వతంగా ఈలోకాన్ని విడిచి తన రూపానికీ, చేష్టలకూ సంబంధించిన స్మృతులను మాత్రం తల్లి తండ్రులకు విడిచి వెళ్లిపోయినాడు.

పార్వతి దుఃఖం హృదయాంతరం నుండి కట్టలు తెంచుకొని వెల్లువలై కన్నీళ్లుగా వెల్వడుతోంది. ఆమె చూడకుండా మధు ఒకటి రెండు మార్లు కన్నులొత్తుకున్నాడు. మధు అక్కగారొక్కరే ధైర్యాన్నవలబించి పార్వతిని ఓదారుస్తోంది.

సమీపంలోనే ఉన్న స్మశానభూమిలో రవి భౌతిక దేహం పూడ్చబడింది. బరువైన హృదయాలతో అంతా ఇంటికి చేరారు.

పరామర్శకొచ్చిన వారిలో మధుకు పినతండ్రి వరుసైన ఆయన అన్నమాటలు పార్వతి ఇంకా మరవలేదు. "వాడిని ఎక్కువగా చూస్తే దృష్టిదోషం కల్గుతుందేమో ననిపించేది. అన్నింటితో పాటు అతి సుందరమైన వస్తువులు కూడా క్షణికాలేకదా" అన్నవి ఆయన మాటలు.

మూడు రోజులూ అయిన తర్వాత ఆచారాలలో నమ్మకమున్న అక్కగారి ఆదేశం ప్రకారం మధు పార్వతి పెద్దపిల్లవాడు స్నానాలు చేసిన తర్వాత కొన్ని పాలనుకాచి మధుకు యిచ్చి రవిని భూస్థాపితం చేసిన చోట పోసిరమ్మన్నది. పాలచెంబు తీసికొని వెళ్లబోతూన్న భర్తను పిలచి పార్వతి కన్నీళ్లతో, "నారవి ఇంత వేడిపాలను త్రాగడు" అన్నది. మధు ఆమె అమాయకత్వంలోని ఆపేక్షను గ్రహించి, "చల్లారిన తర్వాతనే పోసి వస్తాను," అన్నాడు.

* * *

అలలవలె వస్తూన్న పార్వతి మనసులోని దృశ్యాలు ఇంతదాకా వచ్చి తెగిపోయినై. ఆమె సమీపంలోనే అంత వరకూ మసులుతూన్న పిల్లవాడు పీటపైన పీటను చేర్చి బీరువాలోపైన పెట్టిన గాజు పాత్రలోని పాలను త్రాగబోయి క్రింద జారవిడిచాడు. పాలు ఒలికి పాత్రముక్కలైంది. ఈ శబ్దానికి సావిట్లో సామాన్లు సర్దుతూన్న మధు లోపలికివచ్చి శబ్దానికి కారణం గ్రహించి మళ్లీ తన పనిలో నిమగ్నుడైనాడు. భర్త ఆగమనాన్ని గ్రహించిన పార్వతి కళ్లను తుడుచుకోవటంలో ఒక కన్నీటి చుక్క మాత్రం పగిలిన గాజు ముక్కమీద పడి మిలమిలా మెరుస్తున్నది.

# వనమహాత్మ్యం

ప్రజలు మొరపెడుతున్నారు "ఆకలి",
పాపం! మన్షికిది ఒక ఘోరకలి,
ఎండి పోతున్నవి వాళ్ల డొక్కలు,
పాతమంటాడు మన్షి మొక్కలు.
నిరుటి మొక్కలచావు చూసేవాడు
లేడు, యీ ప్రపంచంలో నేడు.

కాని, మళ్లీ శాంక్షన్ మూడుకోట్లు,
ఎందుకంటే ఖాళీ ఐన "మొక్కల చోట్లు"
పుట్టుతున్నవి రోజూ లక్ష పార్టీలు,
చూడబోతే వొర్తి డర్టీలు.
నిన్న నేటికి లేదు సామ్యం,
ఇదే కాబోలు ప్రజాస్వామ్యం!

—భం. ప. రావు.